క్లుప్తంగా

మట్టి వ్యర్థాల తొలగింపు



మట్టి వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 20వ వార్డులోని వైఎస్సార్ కాలనీ సమీపంలో పంట కాలువ వెంబడి పేరుకు పోయిన మట్టి వ్యర్థాలను గురువారం తొలగించారు. ఈ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు ముక్కా దాలియ్య, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార కట్టడాల తొలగింపు



మండపేటలో అనధికార అంతస్తును తొలగిస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం (మండపేట): ఏపీ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఆదేశాలపై మండపేట మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో గురువారం పట్టణంలోని అనధికార కట్టడాల తొలగింపు చేపట్టారు. కమిషనర్ టీవీ రంగారావు ఆదేశాలపై టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది సమక్షంలో అనధికార కట్టడాలపై సర్వే చేశారు. వారు గుర్తించిన పట్టణంలోని ఓ భవనంపై అనధికారికంగా నిర్మించిన అంతస్తును తొలగించారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి



రాయవరంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ తదితరులు

రాయవరం: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. రాయవరంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఒక రోజు–ఒక గంట–ఒక్కటిగా పేరుతో వలంటరీ శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్, ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, పంచాయతీ కార్యదర్శి పి.వెంకటరత్నం, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందర పట్టణంగా తీర్చిదిద్దుతాం

కపిలేశ్వరపురం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పర్యవేక్షణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ, మండపేటను సుందర పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కపిలేశ్వరపురం (మండపేట): ప్రతి ఒక్కరిపై పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఉందని ఇఫ్కో జిల్లా మేనేజర్ జి.శ్యామ్ ప్రసాద్ బాబు అన్నారు. తాపేశ్వరం పీఏసీఎస్ కార్యాలయంలో సంఘ చైర్మన్ పడాల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంస్థ ద్వారా వేప మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ, సంస్థ ద్వారా 4 వేల మొక్కలను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. పీఏసీఎస్ సంఘాల ద్వారా ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు.

కాపాడితూ..!

- పశువులకు ముమ్మరంగా గాలికుంటు వ్యాక్సినేషన్
- నెల రోజుల పాటు ముమ్మర ప్రక్రియ
- నియోజకవర్గంలో 32 వేల పశువులకు టీకాలు లక్ష్యం
- ఇప్పటికే 60 శాతం పూర్తి



పశువుకు టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది



కె.గంగవరం మండలం సుందరపల్లిలో వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏహెచ్ ఏడీ రామకృష్ణ

కె.గంగవరం: అన్నదాతలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే వ్యవసాయంతో పాటు పశుపోషణ కూడా కీలకం. కాలక్రమంలో వచ్చే సీజనల్ వ్యాధులు పాడి పరిశ్రమ రంగాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. వర్షాకాలంలో పశువులకు అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. తద్వారా పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుంది. దుక్కి పశువుల సామర్థ్యం క్షీణిస్తుంది. పెయ్యలు ఎదకు రాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇటువంటి నేపథ్యంలో వర్షాకాలంలో పశువులకు సోకే వివిధ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశు వైద్య నిపుణులు పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

పశువులకు తీవ్ర జ్వరం, నీరసం రావడం, కొద్దిపాటి ఎండకు సైతం పశువుల్లో అలసట, దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గడం వ్యాధి లక్షణాలు. పాలు తాగే దూడల్లో మరణాలు సంభవించవచ్చు. చికిత్స విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే పశువులు మరణించవచ్చు.

వ్యాక్సినేషన్ ప్రయోజనాలు

వ్యాధి సోకిన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తి పెంచవచ్చు. వ్యాధి సోకిన దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం పెరుగుతుంది. దూడల్లో మరణాలు తగ్గి, ఆరోగ్యంగా ఎదుగుదలకు దోహదం చేస్తాయి. పశువుల గుర్తింపునకు చెవికి పోగు వేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుంది.

చురుగ్గా వ్యాక్సినేషన్

నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్‌లో పశువులకు రక్షణగా గాలి కుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే 60 శాతం మేరకు వ్యాక్సినేషన్ పూర్తి చేశారు. నూరు శాతం లక్ష్యాన్ని వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గాలికుంటు వ్యాధి పశువులకు ప్రాణాంతకంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం వ్యాక్సినేషన్‌ను దేశవ్యాప్తంగా చేపట్టింది. ఏటా ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా కె.గంగవరం మండలంలో ఈ నెల 15న కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాలుగు నెలల వయస్సు దాటిన ఆవు, గేదె పెయ్యలు మొదలుకుని.. ఆరోగ్యంగా ఉన్న పెద్ద పశువులన్నింటికీ టీకాలు వేస్తున్నారు. మండలంలో 10,011 పశువులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో ఇప్పటికే ఐదు వేలకు పైగా టీకాలు వేసినట్లు సమాచారం. పామర్రు, యండగండి, కూళ్ల, అముజూరు, సుందరపల్లి, కుడుపూరు, దంగేరు, కోటిపల్లి, కోట తదితర గ్రామాల్లో ఇప్పటికే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, పశువులకు టీకాలు వేశారు.

టోల్ ఫ్రీ నంబర్

పశువులకు సీజన్‌లో వచ్చే అంటువ్యాధుల సమస్యలను నివృత్తి చేసేందుకు వీలుగా జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా 1962 టోల్ ఫ్రీ నంబరును అందుబాటులోకి తెచ్చారు. ప్రధానంగా గాలికుంటు వ్యాధికి సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా ఫోన్ చేసేందుకు అవకాశం కల్పించారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం



నిర్దేశించిన సమయానికి లక్ష్యాన్ని చేరుకుంటాం. రామచంద్రపురం నియోజకవర్గంలో 32 వేలకు పైగా పశువులు ఉన్నాయి. ఇప్పటికే 60 శాతం పశువులకు వ్యాక్సినేషన్ పూర్తి చేశాం. మిగిలిన వాటికి వచ్చే నెల 15లోగా వ్యాక్సిన్ వేసే ప్రక్రియను పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నాం. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేయించాలి.

– ఎం.కృష్ణార్జున్, మండల పశు వైద్యాధికారి

అధినేతను కలిసిన ప్రజాప్రతినిధులు



వైఎస్ జగన్‌ను కలిసిన అనంతరం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో ప్రజాప్రతినిధులు, నాయకులు

కపిలేశ్వరపురం: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కపిలేశ్వరపురం మండల పరిషత్‌కు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రజాప్రతినిధులను అధినేతకు పరిచయం చేశారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి దుర్గారావు, పార్టీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు శాకా శ్రీనివాస్, గుణ్ణం భానుప్రసాద్, మండల పరిషత్ విప్ పలివెల మధు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు నక్కా సింహాచలం, మేడిశెట్టి దుర్గారావు ఉన్నారు.

వీధి వ్యాపారుల అభ్యున్నతికి పీఎం స్వనిధి

మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పట్టణంలో అర్హత కలిగిన వీధి వ్యాపారులు తమ అభివృద్ధి కోసం పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. గురువారం స్థానిక ముచ్చుమిల్లి అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద చైర్‌పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన లోక్ కల్యాణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం స్వనిధి ద్వారా తొలి విడతలో రూ.10వేల నుంచి రూ.15 వేలు, రెండో విడతలో రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు వీధి వ్యాపారులకు రుణాలు ఇస్తారన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ డి.పెంచలయ్య మాట్లాడుతూ, లోక్ కల్యాణ్ మేళా అనేది వీధి వ్యాపారులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమని, దీనిని 2029 వరకు పొడిగించినట్లు వివరించారు. పీఎం స్వనిధిలో నమోదైన సభ్యులకు సీబీజీలుగా ఏర్పాటు చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించే విధంగా చేస్తామన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్య మాట్లాడుతూ, ఫుడ్ కలర్స్, టేస్టింగ్ సాల్ట్ ఆహార ఉత్పత్తుల్లో ఉపయోగించరాదని, తద్వారా ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సును ఫుడ్ వెండర్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సుమారు 200 మంది వీధి వాపారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆరోగ్య అనుబంధ రంగాలపై అవగాహన అవసరం



మండపేటలో ఫార్మసిస్టును సత్కరిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): ఆరోగ్య అనుబంధ ఫార్మా తదితర రంగాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. మండపేట టౌన్ హాల్‌లో గురువారం నిర్వహించిన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. టిడ్కో కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఫార్మసిస్టు దేవకిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భవాని, ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, నాయకులు బొడ్డు రామకృష్ణ, ముక్కా దాలయ్య, జొన్నపల్లి సత్తిబాబు, కాళ్ల ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా సెలవులు

కపిలేశ్వరపురం (మండపేట): దసరా సందర్భంగా మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం నుంచి అక్టోబర్ ఐదు వరకూ సెలవులు మంజూరు చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ అధికారుల ఆదేశాల మేరకు సెలవును ప్రకటించినట్టు చెప్పారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



రజత కవచాలంకరణలో విజయదుర్గా అమ్మవారు



కాత్యాయనీ అవతారంలో మాణిక్యాంబ అమ్మవారు



రజత కవచాలంకృతులైన విజయదుర్గా అమ్మవారు



పీఠంలో భక్తులు ఏర్పాటు చేసుకున్న కలశాలు

రాయవరం: వాడవాడలా శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో గురువారం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విజయదుర్గాదేవి ఉత్సవమూర్తి సహిత పంచాయతన దేవతలు, శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి విగ్రహాల మధ్య వేలాది మంది భక్తులు కలశాలను ఏర్పాటు చేసుకున్నారు. పీఠంలో అమ్మవారికి విఘ్నేశ్వరపూజ, నవగ్రహఅర్చన, గోపూజ, శ్రీచక్ర అర్చనలతో పాటు సప్తశతి పారాయణం, రుద్రాభిషేకం, గణపతి, నవగ్రహ, రుద్ర, మత్యుంజయ, నక్షత్ర హోమాలను నిర్వహించారు. పీఠంలో విజయదుర్గా అమ్మవారిని రజత కవచ అలంకారంలో పలు రకాల పూలు, సర్వాభరణాలతో అలంకరించారు. భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వి.వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పెదపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

కాత్యాయనీ అవతారంలో మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న మాణిక్యాంబ అమ్మవారు దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం కాత్యాయనీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

కాత్యాయనీ దేవిగా కనకదుర్గమ్మ

రామచంద్రపురం: దేవీ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం పట్టణంలోని జోడు తూముల వద్ద వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలంకార బ్రహ్మ చెరుకుపల్లి గణేష్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కపిలేశ్వరపురం, అంగర, టేకి, వల్లూరు, నేలటూరు తదితర గ్రామాల్లో అమ్మవార్లను కాత్యాయనీ అవతారంలో అలంకరించారు. మండపేట పట్టణంలోని గాంధీనగర్ విజయదుర్గా అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి.

గర్భిణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



కోరుమిల్లిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మాణిక్యం

కపిలేశ్వరపురం: తల్లీబిడ్డల మెరుగైన ఆరోగ్యం కోసం గర్భిణుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో వక్తలన్నారు. కోరుమిల్లిలో సీడీపీఓ యు.పూర్ణిమ పర్యవేక్షణలో సూపర్‌వైజర్ ఐ.మాణిక్యం ఆధ్వర్యంలో పోషణమాసం అవగాహన సదస్సు జరిగింది. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతం చేసి, వారికి పండ్లు, పూలు, గాజులు, పసుపు, కుంకుమ అందజేశారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఎంపీటీసీ సభ్యుడు సుంకర వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మోటిపల్లి బాపిరాజు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి



కె.గంగవరంలో పండిట్ దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కె.గంగవరం: భారతీయ జన సంఘ్ సహ వ్యవస్థాపకుడు దివంగత పండిట్ దీన్‌దయాళ్ జయంతిని మండలంలోని అముజూరు గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ఎల్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. తొలుత పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన పండిట్ దీన్‌దయాళ్ దేశభక్తి, ఉన్నత భావాలు కలిగిన నేత అని కొనియాడారు. కార్యక్రమంలో యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (మండపేట): బీజేపీ మాతృక సంస్థ జనసంఘ్ సహ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ జయంతిని మండపేట పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు నాళం ఫణి ప్రకాష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడుతూ దీన్ దయాళ్ సైద్ధాంతిక అవగాహన భారతదేశానికి దిక్సూచి అన్నారు. తొలుత దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాయవరం: ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త, అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని రాయవరంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గాశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు పాల్గొన్నారు.

రక్తహీనతపై అప్రమత్తత అవసరం



పోషకాహార స్టాల్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్, వైద్యాధికారులు

రామచంద్రపురం రూరల్: కిశోర బాలికలను స్క్రీనింగ్ చేసి, వారిలో రక్తహీనతను గుర్తించవచ్చని, రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ సందీప్‌నాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి రత్నసుధ అన్నారు. స్వస్థ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ద్రాక్షారామలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మొత్తం 108 మందికి వైద్య సేవలు అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పోషకాహార స్టాల్ ఏర్పాటు చేశారు. హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బోసు బొమ్మ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల దుష్పరిణామాలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు.

కాజులూరు: ఆరోగ్య నియమాలు సక్రమంగా పాటిస్తేనే మెరుగైన ఆరోగ్యాన్ని పొందగలరని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీవీఎల్ శ్రేయ అన్నారు. మంజేరు పీహెచ్‌సీ సబ్ సెంటర్ వద్ద స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం జరిగింది. 170 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ గుంటూరి అప్పారావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్యంతో మెరుగైన సమాజం

కపిలేశ్వరపురం: సామాజిక ఆరోగ్యంతో మెరుగైన సమాజం నిర్మితమవుతుందని స్వస్థ నారీ స్వశక్త్ అభియాన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. మండపేట పట్టణంలోని 23, 24 వార్డుల పరిధిలో టౌన్‌హాల్‌లో, 10, 11 వార్డుల మహిళలకు ప్రకాశం పాఠశాల ఆవరణలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు భవాని, రమ్యలక్ష్మి మహిళలను పరీక్షించారు. మండపేట రూరల్ మండలం వేములపల్లి బంగారమ్మ కాలనీ వార్డు సచివాలయంలో వైద్యాధికారి డాక్టర్ షీరా జాన్ వెస్లీ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

మిత్ర పురుగుల సంరక్షణ కీలకం

రామచంద్రపురం రూరల్: పురుగు మందుల పిచికారీ సమయంలో రైతులు మిత్ర పురుగుల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఏరువాక కేంద్రం జిల్లా డాట్ కో–ఆర్డినేటర్ నంద కిషోర్ రైతులకు సూచించారు. వెలంపాలెం గ్రామంలో గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి పొలంలో పురుగుల నియంత్రణ, మిత్ర పురుగుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అధిక మోతాదులో పురుగు మందులు, ఎరువుల వాడకంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం, ఎరువుల వాడకంపై ఏడీఏ బి.నాగకుమార్ అవగాహన కలిగించారు. ఎంఏఓ టి.మణిదీప్, వీఏఏలు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో నైపుణ్యాభివృద్ధి

రామచంద్రపురం రూరల్: దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్పులతో ప్రాయోగిక నైపుణ్యాలు అభివృద్ధి అవుతాయని ద్రాక్షారామ, హసన్‌బాద జెడ్పీ హైస్కూళ్ల హెచ్‌ఎంలు పి.శేఖర్, పీఎస్‌బీఎస్‌కే సుందరి గురువారం తెలిపారు. ద్రాక్షారామ విద్యార్థులకు ఐటీ ఉపాధ్యాయుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో ద్రాక్షారామలో జిరాక్స్ ఉపయోగాలు, ఇంటర్నెట్ బ్రౌజింగ్, కంప్యూటర్ రిపేర్ అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే హసన్‌బాద విద్యార్థులకు ఆటోమోటివ్, అగ్రికల్చర్ ట్రేడ్స్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా తోటపేటలోని ట్రాక్టర్ మెకానిజం గ్యారేజ్‌లోను, ఫెర్టిలైజర్ షాపులోను శిక్షణ అందించారు. జిల్లా జీసీడీఏ భీమారావు, జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ రమేష్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

అధిక తేమ, ఉష్ణోగ్రతలతో తెగుళ్లు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

కె.గంగవరం: ప్రస్తుతం వాతావరణంలో అధిక తేమ, అధిక ఉష్ణోగ్రత ఉండడం వల్ల వరి పంటకు పొడ తెగులు, మాగుడు ఆశించవచ్చని ఏరువాక కో–ఆర్డినేటర్ నందకిషోర్ అన్నారు. మండలంలోని కుందూరులో గురువారం రైతులకు ప్రస్తుత వరిసాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తే మేలు జరుగుతుందని నందకిషోర్‌తో పాటు, రామచంద్రపురం వ్యవసాయ సంచాలకుడు నాగకుమార్ తెలిపారు. తెగుళ్ల వల్ల వరికాండం మొదట్లో భూమి నుంచి వ్యాప్తి చెందే శిలీంద్రాల వల్ల బూడిద రంగు మచ్చలు ఏర్పడతాయని నందకిషోర్ చెప్పారు. ఈ తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మచ్చలు పెద్దవిగా మారి, ఆకులు, కాండం ఎండిపోతుందన్నారు. దీని నివారణకు పొలం గట్లపై కలుపు లేకుండా చూసుకోవడంతో పాటు, నత్రజని వాడకం తగ్గించి పొటాష్ ఎరువు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సద్గురుమూర్తి, గ్రామ పెద్దలు నాయుడు, మేడిశెట్ట బాబి, వీఏఏలు కృష్ణతేజ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

‘సూర్యఘర్’ను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏఈ భాస్కరకుమార్ తదితరులు

కె.గంగవరం: విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ కె.గంగవరం అసిస్టెంట్ ఇంజినీర్ టి.భాస్కరకుమార్ అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో గురువారం ఈ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఒక్కసారి పెట్టుబడితో 20 ఏళ్ల వరకు చార్జీలు లేని విద్యుత్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు. దీంతో పాటు మిగులు విద్యుత్‌తో ఆదాయం కూడా సమకూరుతుందని చెప్పారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78 వేల వరకు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. అంతేకాకుండా బ్యాంకు రుణాలు కూడా పొందవచ్చన్నారు. విద్యుత్ బిల్లులకు బదులు కొన్నాళ్ల పాటు రుణ వాయిదాలు చెల్లిస్తే.. తర్వాత పూర్తిగా విద్యుత్‌ను ఉచితంగా వాడుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, నాయకులు చిర్రా రాజ్‌కుమార్, చిల్లి నాగేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.